క్లుప్తంగా

వసతి గది ప్రారంభం



వసతి గదిని ప్రారంభిస్తున్న సర్పంచ్ హరిక్రిష్ణ తదితరులు

ఆస్పరి: మండలంలోని చిన్నహోతూరులో సర్పంచ్ హరిక్రిష్ణ, వార్డెన్ అనిమిరెడ్డి బృందం, గ్రీన్ టీ సభ్యులు కలిసి రూ.4 లక్షలతో నిర్మించిన వసతి గది, డైనింగ్ ప్లాట్ ఫారంను శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి వెంకట లక్ష్మమ్మ సర్పంచు, దాతలను అభినందించారు.

కలశ స్థాపనకు విరాళం



విరాళం ఇస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు విరుపాక్షి

చిప్పగిరి: జెడ్పీటీసీ సభ్యుడు విరుపాక్షి దేవనకొండ మండలంలోని కుంకనూరు గ్రామ శివాలయంలో కలశ స్థాపనకు రూ.10,000 విరాళం అందజేశారు. శనివారం కుంకనూరు గ్రామస్తులు జెడ్పీటీసీని కలిసి ఆర్థిక సాయం కోరగా ఆయన స్పందించి తనకు తోసిన సాయం చేశారు.

నారా లోకేష్‌పై పోలీసులకు ఫిర్యాదు



ఎస్ఐకు ఫిర్యాదు చేస్తున్న సోషల్ మీడియా సభ్యులు

ఆలూరు రూరల్: యువగళం పాదయాత్రలో నారా లోకేష్ టీడీపీ కార్యకర్తలను రెచ్చగొట్టి వారి ద్వారా దాడులు చేయిస్తూ.. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిన్నారని, అతనిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా జిల్లా కో–కన్వీనర్ లింగమూర్తి, సభ్యులు రాజు, ఆనంద్ తదితరులు శనివారం ఎస్ఐ డాక్టర్ నాయక్‌కు ఫిర్యాదు చేశారు. ఎవరిపై ఎక్కువ కేసులుంటే వారికి నామినేటెడ్ పదవులిస్తామని పరోక్షంగా దాడులను ప్రోత్సహిస్తున్నారని అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దాం



మాట్లాడుతున్న ఎంపీపీ రంగమ్మ

ఆలూరు రూరల్: అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దామని ఎంపీపీ రంగమ్మ అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ మీటింగ్ హాల్‌లో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. అనంతరం పలు సమస్యలపై చర్చించి, తీర్మానాలు చేశారు. సమావేశంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ, కో–ఆప్షన్ మెంబర్ మహబూబ్ బాషా, వైస్ ఎంపీపీలు శ్రీరాములు, నాగవేణి, ఎంపీడీఓ అల్లబకష్, డిప్యూటీ తహసీల్దార్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ



బిల్లేకల్లు గ్రామ సచివాయాలన్ని తనిఖీ చేసిన డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి

పత్తికొండ రూరల్/ఆలూరు: పత్తికొండ మండల పరిధిలోని చిన్నహుల్తి, ఆస్పరి మండలంలోని బిల్లేకల్లు గ్రామాల సచివాలయాలను డీఎల్‌డీఓ బాలక్రిష్ణారెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ పథకాలను అర్హులందరికీ పారదర్శకంగా అందించేందుకు కృషి చేయాలని సూచించారు.

ముగ్గురికి గాయాలు

వెల్దుర్తి: హైవే 44పై మండల పరిధిలోని మంగంపల్లె స్టేజ్ ఫంక్షన్ హాల్ ఎదురుగా శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. కర్నూలు వైపు నుంచి డోన్ వైపు వెళ్తున్న కారు ముందు వెళ్తున్న కారును ఢీకొంది. ఆ కారు బైక్‌ను ఢీకొంది. బైక్ రహదారి పక్కన నిలుచున్న మరో బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. అటుగా వెళ్తున్న సీఐ యుగంధర్ క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో కర్నూలు ఆసుపత్రికి తరలించారు.

కరువు నేలలో.. కృష్ణమ్మ పరవళ్లు

- హంద్రీ వెంట పంటలకు జీవకళ
- గ్రావిటీ కింద చెరువుల కింద వరిసాగుకు సమాయత్తం
- దివంగత వైఎస్సార్ చలువతో హంద్రీ నీవా కాలువ ఏర్పాటు



హంద్రీనీవా కాలువలో ఉధృతంగా పారుతున్న నీరు



తొగర్చేడు సమీపంలో వరినారు పోసిన దృశ్యం

కృష్ణగిరి: కరువునేల పత్తికొండ నియోజకవర్గంలో కృష్ణమ్మ వరవళ్లు తొక్కుతోంది. వర్షాభావం వల్ల వాడుపట్టిన పైర్లకు హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలు జీవం పోస్తున్నాయి. వైఎస్ఆర్ ముందు చూపు లేకుంటే ఇక్కడి ప్రాంతం ఎడారిగా మారేది. ఆయన హయాంలో జలయజ్ఞం ద్వారా హంద్రీనీవా కాలువ ఏర్పాటు చేసి కృష్ణాజలాలు తీసుకురావడంతో ఏటా హంద్రీనీవా ద్వారా రాయలసీమలో సిరులు కురుస్తున్నాయి.

జిల్లాలో ఏడు ఎత్తిపోతల పథకాల ద్వారా నీటిని పంపింగ్ చేసి అనంతపురం జిల్లాలోకి తరలిస్తున్నారు. అలాగే కృష్ణగిరి, పందికొన వద్ద రెండు రిజర్వాయర్‌లు ఏర్పాటు చేశారు. జిల్లాలో అత్యధికంగా పత్తికొండ నియోజకవర్గంలోని కృష్ణగిరి మండలంలో దాదాపుగా 30 కిలోమీటర్లు ఈ కాలువ ప్రయాణిస్తోంది. తొగర్చేడు, కంబాలపాడు, ఆలంకొండ గ్రామాల సమీపంలో మూడు ఎత్తిపోతల పథకాలున్నాయి. కృష్ణగిరి గ్రామ సమీపంలో 0.016 కెపాసిటీతో రిజర్వాయర్ ఏర్పాటు చేసి 5,100 ఎకరాలకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకున్నారు. వీటికి తోడు పుట్లూరు వద్ద ఎల్లనాగిరెడ్డి చెరువు, కంబాలపాడు, పెనుమాడ, చుంచు ఎర్రగుడి, ఆలంకొండ గ్రామ సమీపంలో ఉన్న కూర్మగిరి చెరువులకు గ్రావిటీ ద్వారా ఏడేళ్లుగా నీరు వస్తోంది. కృష్ణగిరి మండలంలో రిజర్వాయర్‌తోపాటు లక్కసాగరం వద్ద చానల్ కాలువ ఏర్పాటు చేయడంతో లక్కసాగరం, లాల్‌మాన్‌పల్లె, చుంచు ఎర్రగుడి గ్రామాలకు చెందిన 2,400 ఎకరాలకు సాగునీరు అందుతోంది. జిల్లాలో ఈ ప్రాజెక్టు కింద 80 వేల ఎకరాలకు సాగునీరు అందించేలా ఆనాడు రూపకల్పన చేయగా నేడు అదనంగా మరో 20 వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. దీంతో ఇక్కడి ప్రజలు రాజన్నకు గుండెల్లో గుడి కట్టి పూజిస్తున్నారు.

త్వరలో 68 చెరువులకు నీటి మళ్లింపు

కృష్ణగిరి మండలం లక్కసాగరం సమీపంలోని హంద్రీనీవా కాలువ నుంచి 68 చెరువులకు నీరు మళ్లించే పథకం పనులు దాదాపుగా పూర్తయ్యాయి. పులిచెర్ల గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన డెలివరీ చాంబర్‌లోకి నీటిని పంపి అక్కడి నుంచి మూడు గ్రావిటీ పైప్ లైన్‌ల ద్వారా నీటిని చెరువులకు పంపిణీ చేయడం జరుగుతుంది. 2018లో రూ.186 కోట్లతో పనులు చేపట్టిన అప్పటి ప్రభుత్వం ఎన్నికల నాటికి కేవలం 15 శాతమే పనులు చేసి మమ అనిపించారు. 2019 ఎన్నికల తర్వాత మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి.. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికితీసుకెళ్లి నిధులు మంజూరు చేయించడమే గాకుండా పనులు వేగవంతంగా అయ్యేలా చర్యలు తీసుకున్నారు. నాలుగు నియోజకవర్గాల్లో ని 68 చెరువులకు సంబంధించి పైప్‌లైన్ పనులు పూర్తిచేశారు. ఇప్పుడు హంద్రీనీవా నీరు మరోమారు రావడంతో ట్రయల్‌రన్ నిర్వహించినతర్వాత పథకాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు హెచ్ఎన్ఎస్ అధికారులు తెలియజేశారు. ఈ పథకం ప్రారంభమైతే మరో 10 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది.

వరిసాగు అన్నదాతలు సమాయత్తం..

హంద్రీనీవాకు ముందస్తుగా నీరు రావడంతో అన్నదాతలు వరిసాగుకు సమాయత్తమయ్యారు. హంద్రీనీవా కాలువ వెంట ఉన్న పొలాల రైతులు మోటార్ల ద్వారా నీరు తీసుకుని నారుమళ్లను సిద్ధం చేసుకుంటున్నారు. గతేడాది ఉన్న నీటితో కూర్మగిరి, కంబాలపాడు చెరువుల కింద అన్నదాతలు నారు పెంచి నాట్లు వేస్తున్న సమయంలో నీరు రావడంతో ఇక పంటకు నీటి కొరత ఉండదని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అలాగే 15 రోజుల్లో చుంచు ఎర్రగుడి, పెనుమాడ, యల్లానాగిరెడ్డి చెరువులకు నీరు చేరనుండటంతో ఇక్కడి రైతులు కూడా సాగుకు సిద్ధంగా ఉన్నారు. నీరు రావడంతో ఖరీఫ్, రబీ పంటల్లో వరిసాగు చేసేందుకు అవకాశం వచ్చిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రూ.3 కోట్లతో వెల్దుర్తికి తాగునీరు..

సాధారణ ఎన్నికల హామీలో భాగంగా వెల్దుర్తి పట్టణానికి తాగునీరు ఈ నీటినే వాడుతున్నారు. దశాబ్దాలుగా పాలించిన నాయకులు వెల్దుర్తి తాగునీరు అందించకపోవడంతో ఎమ్మెల్యేగా గెలిచిన కంగాటి శ్రీదేవి సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దృష్టికి తీసుకెళ్లి రూ.3 కోట్ల నిధులు మంజూరు చేయించారు. కృష్ణగిరి రిజర్వాయర్ నుంచి నీటిని సేకరించి మోడల్‌స్కూల్ సమీపంలో ఫిల్టర్ చేసి అక్కడి నుంచి పైప్ లైన్ ద్వారా 2021 నుంచి వెల్దుర్తికి తాగునీరు అందిస్తున్నారు. రిజర్వాయర్‌లో నీరు అడుగంటిన సమయంలో మరలా హంద్రీనీవా కాలువకు నీరు రావడంతో వెల్దుర్తి పట్టణ ప్రజల నీటి సమస్యకు ఢోకా లేదు.

హంద్రీనీవాతో పొలాలకు సాగునీరు



నిత్యం కరువుతో అల్లాడుతున్న ఈ ప్రాంతానికి వైఎస్సార్ దేవుడిగా వచ్చారు. ఆయన హయాంలో హంద్రీనీవా కాలువ ఏర్పాటుతోపాటు నీరు వచ్చేలా చర్యలు తీసుకున్నారు. ఎక్కడో వెళ్లే కృష్ణాజలాలను ఎత్తిపోతల పథకం ద్వారా ఈ ప్రాంతానికి తీసుకవచ్చారు. దీంతో ఇప్పుడు ఈ ప్రాంతం సాగునీరుతో కళకళలాడుతోంది. మంచి పంటలు పండించుకుంటున్నాం. ఈ భూమి ఉన్నత వరకు ఇక్కడి ప్రజలు రాజనన్న మరువరు.

– కురువ నాగరాజు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పుట్లూరు

వైఎస్సార్ జ్ఞాపకాలు పదిలం



పత్తికొండ నియోజకవర్గంలో దివంగత వైఎస్సార్ చేపట్టిన జలయజ్ఞం ఫలాలు శాశ్వతంగా నిలిచిపోయాయి. ఆయన జ్ఞాపకాలు పదిలం. కృష్ణగిరి మండలంలో మూడు ఎత్తిపోతల పథకాలతో పాటు రిజర్వాయర్, ఓ కాలువ, వెల్దుర్తి మండంలో ఎత్తిపోతల పథకం, పందికోన వద్ద రిజర్వాయర్ ఏర్పాటు చేయడం ఇక్కడి ప్రజల అదృష్టం. ఈయేడాది జిల్లాలో వర్షాలు లేకపోయినా పొరుగు రాష్ట్రాల్లో కురిసిన వర్షాలకు శ్రీశైలం డ్యాంకు నీరు వచ్చి కాలువకు వదలడంతో ఇక్కడి ప్రాంతాల్లోని ప్రజలకు తాగు, సాగునీరు అందుతోంది. లక్కసాగరం సమీపంలో 68 చెరువులకు నీరు మళ్లించే పనులు కూడా దాదాపుగా పూర్తయ్యాయి. త్వరలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా 68 చెరువులకు నీరు మళ్లించే కార్యక్రమం ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం. – కంగాటి శ్రీదేవి, ఎమ్మెల్యే పత్తికొండ

28న ఆస్పరి మార్కెట్ వేలం

ఆస్పరి: ఈనెల 28న కూరగాయల మార్కెట్ వేలం నిర్వహించునున్నట్లు ఈఓ రామాంజనేయులు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆసక్తి ఉన్న వారు రూ.2 లక్షలు డిపాజిట్, రూ.5 లక్షలకు సా లెన్స్ సిర్టిఫికెట్ తీసుకుని వేలంలో పాల్గొనాలన్నారు.

రోడ్డు వెడల్పు చేయాలి

ఆస్పరి: మండలంలోని బిల్లేకల్లు నుంచి ఎమ్మిగనూరుకు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు వెడల్పు చేయాలని ఏఐవైఎఫ్ నాయకులు లక్ష్మన్న, రమేష్, రంగప్ప, దస్తగిరి తదితరులు డిమాండ్ చేశారు. శనివారం పలువురు విద్యార్థులతో కలిసి రోడ్డుపై ధర్నా చేపట్టారు.

సర్వసభ్య సమావేశం బహిష్కరణ

హొళగుంద: సర్వసభ్య సమావేశాన్ని పలువురు ప్రజాప్రతినిధులు బహిష్కరించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండల మీట్‌ను నిర్వహించడానికి ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధ సిద్ధమవుతుండగా అధికారుల గైర్హాజరుపై ఇంగళదహళ్ ఎంపీటీసీ మల్లికార్జున, సర్పంచ్‌లు వెంకటరెడ్డి, సుధాకర్, వెంకట్రామిరెడ్డి తదితర ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలపై చర్చించడానికి సంబంధిత శాఖల అధికారులు లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. వారొస్తేనే సమావేశానికి హాజరవుతామంటూ బయటకెళ్లిపోయారు.

నేడు, రేపు 'గడప గడపకు మన ప్రభుత్వం'

తుగ్గలి: రాతనలో సోమ, మంగళవారాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జిట్టా నాగేష్‌యాదవ్, సచివాలయ మండల కన్వీనర్ హనుమంతు తెలిపారు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వ పథకాల అమలు తీరు, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటారన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని విజయవంతం చేయాలని వారు కోరారు.

నమ్మకంతో పనిచేయండి



మంత్రి జయరాంను సన్మానించిన జిల్లా నూతన కార్యదర్శి, కార్యవర్గసభ్యులు

- మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: అధిష్టానం అప్పగించిన బాధ్యతలను నమ్మకంతో నెరవేర్చాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సూచించారు. ఇటీవల ఎంపికైన వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు యశోదరెడ్డి, కార్యదర్శి రాంభీమ్‌నాయుడు, జిల్లా ఈసీలు ఎల్లార్తి మల్లికార్జున, హెబ్బటం అయ్యాశప్ప, తెర్నెకల్ రాఘవేంద్ర తదితరులు శనివారం మంత్రిని కలిసి పూలమాలలో సన్మానించి, కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా మంత్రి గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతో నమ్మకంతో పదవులు ఇచ్చారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆలూరు మండల జేసీఎస్ కన్వీనర్ ఈరన్న, వెంకటేష్, హెబ్బటం మాజీ సర్పంచ్ గోవిందు, శ్రీనప్ప, కన్న, రంగన్న, చింతకుంట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆశయానికి అనుగుణంగా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి

కృష్ణగిరి: జగనన్న ఆశయానికి అనుగుణంగా పనిచేయాలని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన పార్టీ శ్రేణులు, హౌసింగ్ లబ్ధిదారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎరుకలచెర్వు గ్రామానికి చెందిన మాదిగ బుజ్జమ్మకు ఇల్లు మంజూరైందని, గ్రామ ఇంజినీరింగ్ అసిస్టెంట్ 40 బస్తాల సిమెంట్, ఇసుక కూడా ఇచ్చారని తెలిపారు. లెంటల్ లెవల్‌కు చేరుకున్నాక అధికారులు బిల్లు పెట్టడం లేదనే విషయం తన దృష్టికి రాగా ఇంటిని పరిశీలించి బిల్లు పెట్టాలని సూచించానన్నారు. కొందరు ఈ ఇల్లు బినామీ అని జిల్లా కలెక్టర్‌కు తప్పుడు సమాచారం ఇచ్చారని, త్వరలో కలెక్టర్‌ను కలిసి నిజాలు వివరించి బాధితురాలికి న్యాయం జరిగేలా చూస్తానన్నారు. సమావేశంలో పత్తికొండ మార్కెట్‌యార్డు చైర్మన్ మాధవరావు, కృష్ణగిరి సొసైటీ చైర్మన్ బ్రహ్మానందరెడ్డి, మండల కో–ఆప్షన్ మెంబర్ షేక్ షాలు మియ్యా తదితరులు పాల్గొన్నారు.

ఉపయోగపడే పనులు చేపట్టాలి



ఓపెన్ ఫోరంలో పాల్గొన్న పీడీ అమరనాథ్‌రెడ్డి

ఆస్పరి: రైతులు, ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉపాధి పనులు చేపట్టాలని నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. 2022–2023 సంవత్సరంలో చేపట్టిన ఉపాధి పనులపై శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఓపెన్ ఫోరం నిర్వహించారు. మండలంలో 1090 పనులకు రూ.8.16 కోట్లు ఖర్చు చేశారు. అధికారులు రూ.17 వేలు రికవరీ చేశారు. కార్యక్రమంలో అంబుడ్స్‌మెన్ చంద్రశేఖర్, అదనపు పీడీ సలీంబాషా, ఎంపీడీఓ రాణెమ్మ, ఏపీడీ పక్కీరప్ప పాల్గొన్నారు.

మండలాభివృద్ధిలో అధికారుల పాత్ర కీలకం

- ఎంపీపీ బొమ్మన సరళారెడ్డి



మాట్లాడుతున్న ఎంపీపీ బొమ్మన సరళారెడ్డి

వెల్దుర్తి: ప్రజలకు సౌకర్యాలు కల్పించడంలో, సంక్షేమం అందించడంలో, మండల అభివృద్ధిలో అధికారుల పాత్ర కీలకమని ఎంపీపీ బొమ్మన సరళారెడ్డి అన్నారు. శనివారం ఆమె ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ శివరాముడు మాట్లాడుతూ భూముల రీసర్వే, ఓటరు సవరణ సర్వే కొనసాగుతోందన్నారు. వివిధ శాఖల అధికారులు తమ పరిధిలో అమలవుతున్న ప్రభుత్వ పథకాలను వివరించారు. ఎప్పటిలాగే మండలంలోని పలు సమస్యలను, పలు శాఖల పరిధిలో అందాల్సిన పథకాల తీరును జెడ్పీటీసీ సభ్యుడు సుంకన్న ప్రస్తావించారు. సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

మదర్ థెరిస్సాకు ఘన నివాళి



మదర్‌థెరిస్సా చిత్రపటానికి పూలమాల వేస్తున్న మహిళలు

పత్తికొండ రూరల్: స్థానిక పోచిమిరెడ్డి సేవాదళ్ కార్యాలయంలో మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్త్రీ సమానత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని కుట్టు శిక్షణ మహిళలు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు లైట్‌నాగరాజు, బోడా సావిత్రి, మాజీ ఎంపీటీసీ గణపతి సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

ఆటో బోల్తాపడి మహిళ మృతి

- మరో ఇద్దరికి గాయాలు



మృతిచెందిన జోగి నాగేంద్రమ్మ

గోనెగండ్ల: మండల కేంద్రంలోని ఎమ్మిగనూరు, కర్నూలు రోడ్డులో నయారా పెట్రోల్ బంక్ సమీపంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడి జోగి నాగేంద్రమ్మ(48) మృతిచెందింది. ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపిన వివరాలు.. ఎమ్మిగనూరు జోగి కాలనీకి చెందిన నాగేంద్రమ్మ, భర్త దుర్గప్పలతో పాటు మరో ఐదుగురు శనివారం సాయంత్రం ఎమ్మిగనూరు నుంచి ఆటోలో గోనెగండ్లకు బయలుదేరారు. నాయారా పెట్రోల్ బంక్ సమీపంలోకి రాగానే ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న గుంతలో పడింది. ఆటో నాగేంద్రమ్మపై పడటంతో తీవ్రంగా గాయపడింది. మరో ఇద్దరికీ గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను గోనెగండ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా నాగేంద్రమ్మ అప్పటికే మృతిచెందినట్లు వైద్య సిబ్బంది నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలు భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి,దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సస్యరక్షణ పద్ధతులు చేపట్టాలి



రైతులతో మాట్లాడుతున్న డీటీసీ ఏడీఏ వెంకటేశ్వర్లు

నందవరం: రైతులు సాగు పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని డీటీసీ ఏడీఏ వెంకటేశ్వర్లు సూచించారు. శనివారం ముగతి గ్రామంలోని ఆర్బీకే–1లో ఆత్మ ఆధ్వర్యంలో ఏడీఏలు శశిధర్‌రెడ్డి, చక్రవర్తి నేతృత్వంలో రైతులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్తి, మిరప, వరి తదితర పంటల్లో ససరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసిన తరువాత తప్పని సరిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ మర్రి స్రవంతి, ఏఈఓ ప్రభావతి, సురేంద్రగౌడ్, వీఏఏ వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

ఆధారం లేనిదే తొలగించొద్దు

ఎమ్మిగనూరు రూరల్: ఆధారం లేనిదే ఓటు తొలగించొద్దని తహసీల్దార్ కె.ఆంజనేయులు బీఎల్వోలకు సూచించారు. శనివారం మండల పరిషత్ సమావేశ భవనంలో ఓటరు నమోదు, తొలగింపులపై బూత్‌లెవల్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమావేశంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ గురు రాజరావు, టౌన్ వీఆర్వో షేక్షావలి పాల్గొన్నారు.

కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోండి

ఎమ్మిగనూరు టౌన్: అనుమతుల్లేకుండా నిర్వహిస్తున్న కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని పీఎస్‌యూ జిల్లా కార్యదర్శి సురేష్ డిమాండ్ చేశారు. శనివారం ఎంఈఓ ఆంజనేయులును కలిసి వినతి పత్రం అందజేశారు.

వ్యవస్థలు నిర్వీర్యం

ఎమ్మిగనూరుటౌన్: ప్రధాని నరేంద్రమోదీ విధానాలతో దేశంలోని వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పంపణ్ణగౌడ్, పట్టణ కార్యదర్శి రంగన్నలు ఆరోపించారు. ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో విశాఖలో ప్రారంభమైన బస్సు యాత్ర పోస్టర్లను శనివారం సంజీవ్ నగర్‌లో వారు ఆవిష్కరించారు.

ప్రతి గడపకు సంక్షేమం



చిన్నకొలుముల పల్లెలో మహిళలతో మమేకమై వారి సమస్యలు వింటున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

- ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రతి గడపక సంక్షేమ పథకాలు అందాయని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నార. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం శ్రీరంగాపురం చిన్నకొలుముల పల్లె, పిక్కిలివాని పల్లెల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకోరావాలని సూచించారు. తవిషికొండ నుంచి, లక్ష్మంపల్లె నుంచి రహదారి సౌకర్యం కల్పించాలని చిన్నకొలుముల పల్లె గ్రామస్తులు కోరారు. రహదారుల ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీడీఓ శ్రీనివాసరావ్, సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎల్ నగరం సమీర్ కుమార్ రెడ్డి, శ్రీరంగాపురం సర్పంచ్ బాలకృష్ణ, నాయకులు సుంకిరెడ్డి, సుంకన్న, వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ కొత్తూరు వెంకటేశ్వరరెడ్డి, శ్రీరంగాపురం బాలకృష్ణ, బాల రంగస్వామి, మురళీకృష్ణ, చిన్న కొలుముల పల్లె గోవిందు రెడ్డి, లక్ష్మిరెడ్డి, నాగిరెడ్డి, పిక్కిలివానిపల్లె మద్దయ్య, లోకేశ్, రామళ్లకోట మాధవస్వామి, అల్లుగుండు శ్రీరాంరెడ్డి, బింగిదొడ్డి జగన్‌మోహన్ రెడ్డి పాల్గొన్నారు.


వైద్య రంగానికి సీఎం వైఎస్ జగన్ పెద్ద పీట



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరు టౌన్: వైద్యరంగానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేసి మారు మూల గ్రామాల ప్రజలకు సైతం వైద్యం అందుబాటులోకి తెచ్చారని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి అన్నారు. పట్టణంలోని మునెప్ప నగర్‌లో శనివారం శిల్పా ఆస్పత్రి నూతన భవన సముదాయాన్ని ఎమ్మెల్యేతో పాటు వైఎస్ఆర్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డిలు ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ప్రైవేట్ ఆస్పత్రుల్లో నిస్వార్థంగా మెరుగైన సేవలను అందించేందుకు వైద్యులు కృషి చేయాలన్నారు. కార్యక్రమలో ఆస్పత్రి వైద్యులు శిల్పా, చంద్రశేఖర్‌యాదవ్, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కెఎస్ రఘు, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వైఎస్ఆర్‌సీపీ జిల్లా కార్యదర్శి రియాజ్‌అహమ్మద్, పట్టణ అధ్యక్షుడు బుట్టా రంగయ్య, కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ షబ్బీర్‌అహమ్మద్, కౌన్సిలర్లు, వైఎస్ఆర్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి కృషి



వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ మోహన్‌రెడ్డి



మల్లికార్జున యాదవ్


తుగ్గలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని ఆ పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ తుగ్గలి మాదిరెడ్డి మోహన్‌రెడ్డి అన్నారు. తనను ఈ పదవికి ఎంపిక చేసిన జిల్లా నాయకులకు, ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి, మండల నాయకులకు శనివారం ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా కార్యదర్శిగా మల్లికార్జున యాదవ్

మద్దికెర: తనను పార్టీ జిల్లా కార్యదర్శిగా ఎంపిక చేసినందుకు కృషి చేసిన ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి కృతజ్ఞతలు చెబుతున్నట్లు మాజీ ఎంపీపీ మల్లికార్జున యాదవ్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి, కార్యకర్తల సమస్యలను జిల్లా కమిటీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

పిల్లలను పాఠశాలలో చేర్పించాలి

- డీఈఓ రంగారెడ్డి



మాట్లాడుతున్న డీఈఓ రంగారెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: బడిఈడు పిల్లలంతా పాఠశాలల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని డీఈఓ రంగారెడ్డి సూచించారు. శనివారం మండల పరిషత్ సమావేశ భవనంలో హెచ్‌ఎంలు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో 3,300 మంది చిన్నారులు బడిబయట ఉన్నారని, వారిని గుర్తించి వెంటనే పాఠశాలల్లో చేర్పించాలన్నారు. సమావేశంలో జిల్లా ఉర్దూ డీఐ ఆదంసాహెబ్, ఎంపీడీఓ బంగారమ్మ, ఎంఈఓలు ఆంజినేయులు, మధుసుదన్‌రాజు, మొయినుద్దీన్ పాల్గొన్నారు.